

# త్రిభుజం

కేవస్వీ

"ఔను గంగా! నిన్ను—నేను - ప్రేమి స్తున్నాను..." అంది సుబ్బలక్ష్మి.

గంగాప్రసాదరావు ఆశ్చర్యపోలేదు. అది ఆమె మనస్సులోని భావమేనని అతనికి తెలుసు.

పార్కులో జనంపలచబడుతున్నారు. చీకటి కమ్ముకుంటోంది.

మౌనంమీద వూగిసలాడేడు గంగ, ఒక్క నిమిషం.

"... నువ్వు గ్రహించేవని నాకు తెలుసు కాని, ఆడపిల్లని...ఆ మాట నువ్వు చెప్పగలిగేంతగా నేనెలా చెప్ప గలను. ఇప్పు డెలా చెప్పేనంటావా? చెప్పక తప్పలేదు. మా అమ్మ రేయిం బవళ్ళూ వొకటే రాద్ధాంతం చేస్తోంది. నాన్న సంబంధాలు చూస్తున్నారునాకు."

"లక్ష్మి..." అన్నాడు గంగ, కంపిత స్వరంతో. ఏనాడో వొకనాడు ఇలాంటి సన్నివేశాన్ని ఎదుర్కోవలసి వస్తుందని అతను ఎదురు చూస్తూనే వున్నాడు. చెప్పాల్సిన సమాధానం అతని దగ్గర సిద్ధంగానే వుంది అయినా

ఎందుకో గొంతు పెగలటం లేదు... "లక్ష్మీ ... నా గురించి నీకు... అంతా తెలుసు..."

"అవును గంగా! ఏ చిన్న సంగతీ దాచుకోకుండా...అంతా చెప్పేసేవు. . ను వ్వెప్పుడూ ఫ్రాంక్‌గా వుంటావు... కాబట్టే నువ్వంటే నాకు..."

"లక్ష్మీ!...అనసూయ ఇంకా ఏదీ తేల్చి చెప్పలేదు..."

దించుకున్న అతని ముఖంలో వెది కింది సుబ్బలక్ష్మి... "నీ కింకా ఆ ఆశ వుందా?"

బొంగురు పోయింది గంగాప్రసాద రావు గొంతు... "ఊహుఁ...కాని... కాని...లక్ష్మీ... అనసూయ పెళ్ళయి పోతే ... అనసూయ ఇంకెవర్నయినా పెళ్ళాడేస్తే..."

"...అప్పుడుగాని...నీ మనసు నీ వశంలోకి రాదు... అంతేగదూ ?..." దృఢత్వం కోసం లక్ష్మిస్వరం క్షణం ఆగింది... "అయినా... నిన్ను నేను ప్రేమిస్తున్నాను గంగా! నువ్వు నన్ను చేసుకున్నా చేసుకోకపోయినా...నేను .. నీదాన్నే..."

ఆకాశంలో శూన్యంలోకి చూస్తు న్నాడు గంగాప్రసాదరావు.

"ఏమిటి గంగా ఆలోచిస్తున్నావు?"

"ఏమీలేదు..."

"నాకు రాత్రిళ్ళు ...నిద్రపట్టదు... నువ్వు నన్ను చేసుకోకపోతే ... ఇంకొకర్ని చేసుకని నేనెలా బ్ర తానా అనిపిస్తుంది ... ఎంతో దిగ పిస్తుంది..."

దీర్ఘంగా నిట్టూర్చేడు గంగాప్రసాద రావు. "నిజం చెప్పనా లక్ష్మీ! ...అన సూయను చేసుకోకపోయిన తర్వాత ఇంకెవరైనా వొకటే నాకు ... నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని తెలుసు. నాకూ అనసూయకూ ఉన్న పరిచయం గురించి తెలిసికూడా నువ్వు నన్నే కోరుకుంటు న్నావంటే ... నీ ప్రేమ ఎంతటిదో తెలీదూ?..."

లక్ష్మి గమ్మున తలొంచుకుంది.

"నువ్వేం వర్రీ అవకు లక్ష్మీ! ... నువ్వెంతో మంచిదానివి...నిన్ను పెళ్ళి చేసుకుంటే...నేను అదృష్టవంతుణ్ణే కాని ... అనసూయ ... సరే నేను రేపే సికింద్రాబాదు వెళ్తాను. అనసూయను గురించి ఏ విషయమూ తేల్చుకుని వొచ్చేస్తాను..."

## 2

కాలేజీలో ప్రేమ అనసూయా గంగా ప్రసాదరావులది. ఇద్దరూ పెళ్ళి చేసు కుందామనే అనుకున్నారు. అనసూయకు అభిమానం...కోపం...ఎక్కువ. అందు గురించి గంగ ఆమెను ఎప్పుడూ వేళా కోళం చేస్తూండేవాడు. ఒకసారి మాటామాటా పెరిగింది. కేంటీన్‌లో కాఫీ తాగుతూ ... "ఇంకోసారి అలా

పి నే నూరుకోను..." అంది నసూయ.

ఏం చేస్తావేమిటి?.. " అన్నాడు ంగ వేళాకోళంగా నే.

"ఏమైనా చేస్తాను. నా అభిమానం కోసం... కావలిస్తే నీతో స్నేహాన్నే వొదులుకుంటాను..." అంది అనసూయ.

"ఏదీ వొదులుకో చూద్దాం—" అన్నాడు గంగ, ఆమె తనని అంత తేలిగ్గా తీసిపారెయ్యదన్న ధీమాతో.

కాఫీసగంలో వొదిలేసి, కేంటీన్ నుంచి వెళ్ళిపోయింది అనసూయ అంతే ఆ తర్వాత కాలేజీలో వున్నన్ని రోజులూ గంగకేసి కన్నెత్తయినా చూడలేదు. వాళ్ళింటి అడ్రస్‌కి జాబు రాసేడు గంగ టెలిగ్రాం లాంటి వుత్తరం వచ్చింది.

"నీ సంగతి నాకు తెలీదు ... నేను మాటమీద నిలబడతాను..."

అప్పట్నుంచి రోజురోజూ చిత్రవధ అనుభవిస్తూనే వున్నాడు గంగ.

ఇతరు లెవరూ అనసూయ అందాన్ని మెచ్చుకోరు. ఆమె కొంచెం నల్లగా వుంటుంది. కుడికన్ను కొంచెం మెల్ల కూడాను. కాని, ఈ రెండు కారణాల వల్లా గంగకు ఆమె అంటే ఇష్టం అన్నిటినీ మించింది ఆమె అభిమానం! ఆమె రాచరికపు ఠీవి!!

... అనసూయవాళ్ళింటి ముందు టాక్సీ దిగుతూ క్షణం ఆగేడు గంగ. అతని గొంతు శూన్యమైపోయింది.

అనసూయే తలుపు తీసింది. గంగను చూసిన ఆమెలో ఆశ్చర్యంలేదు. ఎదురు చూసిన మనిషి వచ్చినట్టుగానే ప్రవర్తిస్తోంది ఆమె

"కాఫీ..."

"వొద్దు..."

"తీసుకోండి ... " ఆ స్వరంలో ఆజ్ఞ చక్రవర్తుల్నే శాసించగల స్వరం.

పదినిమిషాలకిగాని గొంతు పెగుల్చుకోలేదు గంగ...అందుకే ఇంత దూరం వొచ్చేను అనూ—నన్ను క్షమించి—ఇంకెప్పుడూ నీ మనసు నొప్పించను—నా మాట నమ్ము —ఇప్పుడేదో—'

"అవన్నీ ఇప్పుడెందుకు!—"

"అనూ— నువ్వన్నీ మరిచిపోగలవేమో! కా , నేను మర్చిపోలేను. సానుభూతితో ఆలోచించు అనూ — పెళ్ళి చేసుకోవాలనే నేనూ అనుకుంటున్నాను —"

"ప్రసాద్! మీరెంత మంచివారో నాకు తెలుసు—మీ తప్పేంలేదు. నా తత్వం వేరు—"

"అన్నీ నేను సర్దుకుంటాను అనూ! —నువ్వు ఊఁ-అను చాలు-"

సూటిగా చూసింది అనసూయ. చూపు తిప్పుకుంది.

"నా కిప్పుడప్పుడే పెళ్ళిచేసుకోవాలని లేదు—"

"పోనీ పెళ్ళాడదలచుకున్నప్పుడు నా గురించి ఆలోచిస్తావా!—"

ఆతని ముఖంలోని విషాదానికి బండ లైనా కరుగుతాయి అనసూయ బండ కాదు. కానీ, తనో బండ అయినట్లు ప్రవర్తించాలని ఆమె సంకల్పం—

"ఏమో—నే నేమీ చెప్పలేను.దయచేసి ఈవిషయం నన్నింకేమీ అడగొద్దు—"

3

"అంతేనా గంగా!—" అంది సుబ్బ లక్ష్మి.

"ఇంక నన్నేం చెప్పమంటావు లక్ష్మీ!—

"నీ గురించి నిర్ణయం అనసూయ వాయిదా వేసింది — నాగురించి నిర్ణయం నువ్వు వాయిదా వేస్తానంటావు—ఇదెక్కడి న్యాయం!—"

"ఒక్కోసారి జీవితం గణితం కాక తప్పదేమో లక్ష్మీ! నేనూ ఇప్పుడిప్పుడే నీ కేమీ చెప్పలేను — రెండేళ్ళ తర్వాత కూడా అనసూయ నన్ను చేసుకోవడా నికి ఇష్టపడకపోవచ్చు. కాని, ఆలో పల నేను నిన్ను చే సు కో లే ను. అనసూయ చేసుకోకపోయినా ఆమె కోసం ఎదురుచూడ్డంలోని ఆనందమైనా నాకు దక్కనీ లక్ష్మీ!—"

"గంగా! గంగా!—" అంటూ చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది సుబ్బలక్ష్మి.

గంగాప్రసాదరావు కేమీ పాలుపోలేదు. మూఢుడిలా నిలబడ్డాడు.

"లక్ష్మీ! ఈ పరిస్థితుల్లో నేను అశక్తుణ్ణి—నన్ను మన్నించు. కాని, తొందరలో అనసూయ న ఇంకెవర్నయినా పెళ్ళాడితే నిన్ను—"

"చాలు గంగా చాలు—" లక్ష్మి క జ్యోత్యుల్లా వెలుగుతున్నాయి.

"నే నివేమీ వినలేను—నన్ను నువ్వు మరిచిపో—అన్నీ మనం అనుకున్నట్టు జరగవు—"

"లక్ష్మీ!—లక్ష్మీ!—"

"వస్తాను గంగా! మళ్ళీ జీవితంలో ఎప్పటికో—"

* * *

సుబ్బలక్ష్మి తల్లిదండ్రులు లక్ష్మిని వొక వెంకట్రావుకిచ్చి పెళ్ళిచేసేసేరు. తమ గుండెల బరువు దించుకున్నారు. అనసూయ పెద్దచదువుం సుదర్శనాన్ని చేసుకుని, ఆతన్తో ఇంగ్లండ్ వెళ్ళింది చివరకి గంగాప్రసాదరావు పెద్దలు నిశ్చయించినట్టుగానే తొంభై తొమ్మిది వేల కట్నంతో వొచ్చిన కనక సుశీలని పెళ్ళిచేసుకోక తప్పలేదు

కావాలనుకున్నది అందదు. అంది వొచ్చేదాన్ని అందుకోవడానికి పరిస్థితులు అనుకూలించవు.

మూడు బిందువులు, మూడు బిందువుల్ని కలిపే భుజాలు మూడు ఒంటాలు ఒక్కో బిందువుదీ ఒక్కో కోణం—ఒక్కో విషాదస్థితి.

ఈ హృదయనాటకమే లేకపోతే జీవితమే లేదేమో!